విశ్వవిద్యాలయాల్లో పూలే చిత్రాన్ని ప్రదర్శించండి

ఉస్మానియాయూనివర్సిటీ: రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో పూలే చిత్రాన్ని ప్రదర్శించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుంచి వర్సిటీలలో పూలే సినిమాను ప్రదర్శించేందుకు తెలుగులోకి అనువదించాలని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. విద్య ప్రాముఖ్యతను చాటి చెప్పిన పూలే చిత్రానికి పన్ను రాయితీ వల్ల విస్తృత ప్రచారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నేతలు బూర శ్రీనివాస్‌గౌడ్, బండి నరేష్, చంద్రమోహన్ రాయ్, గోదా రవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బెల్టు షాపులను బంద్ చేయాలి

లాలాపేట: తెలంగాణ వ్యాప్తంగా పట్టణాల్లోనేగా కాకుండా గ్రామగ్రామాన బెల్టు షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని వాటిని పూర్తిగా బంద్ చేయాలని తెలంగాణ ప్రజా జీవనరైతు పార్టీ అధ్యక్షుడు చుండి శోభన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శాంతినగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్నే ప్రధాన ఆదాయ వనరుగా ప్రభుత్వాలు భావించడం చాలా దురదృష్టకరమని అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో సారా అమ్మి ప్రభుత్వాలను నడుపడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెబుతూ రాష్ట్రంలో మద్యాన్ని పారిస్తున్నారని మండిపడ్డారు. విచ్చలవిడి మద్యం అమ్మకాలతో పేద, మధ్య తరగతి ప్రజలు, యువత బానిసలై మరింత పేదవారుగా మారుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే అనుచరుడి వీరంగంపై విజిలెన్స్ విచారణ

సనత్‌నగర్: జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్ సుష్మితపై ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరుడు సుదీప్‌పటేల్ వీరంగం సృష్టించిన ఘటనపై విజిలెన్స్ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. విజిలెన్స్ డీఎస్పీ, సీఐతో పాటు నలుగురు సభ్యుల బృందం బేగంపేట సర్కిల్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. డీసీ డాకూనాయక్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు. అలాగే సిబ్బందితో కూడా మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. 'సుదీప్‌పటేల్ టౌన్‌ప్లానింగ్ డీసీపీతో అమర్యాదగా మాట్లాడాడని, నీ అంతు చూస్తానని ఆమెను బెదిరించినట్లు' సర్కిల్ కార్యాలయ అధికారులు వారికి చెప్పినట్లు తెలిసింది. భయపెట్టే రీతిలో దురుసుగా వ్యవహరించడంతో పాటు దూషిస్తూ సుదీప్‌పటేల్ వీరంగం సృష్టించినట్లు వారికి వాంగ్మూలం ఇచిచనట్లు సమాచారం.

ఫోన్ పే చేస్తానని నగదు తీసుకుని పరార్

అమీర్‌పేట: ఏటీఎం కార్డు పనిచేయడం లేదని చెప్పి ఓ విద్యార్థి నుంచి నగదు తీసుకుని ఫోన్ పే చేయకుండా ఉడాయించిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం గోపన్నపల్లికి చెందిన అల్లాడి శివశంకర వరప్రసాద్ ఎస్‌ఆర్ నగర్‌లోని లక్ష్య కళాశాలలో సీఏ ఫౌండేషన్ కోర్సు చదువుతున్నాడు. శ్రీ రాజరాజేశ్వరీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న ప్రసాద్ స్థానికంగా ఉన్న కెనరా బ్యాంక్ ఏటీఎంకు వెళ్లాడు. ఇంతలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన ఏటీఎం కార్డు పనిచేయడం లేదని, అత్యవసరంగా డబ్బు కావాలని రూ.10 వేలు ఇస్తే ఫోన్ పే చేస్తానని నమ్మించాడు. ఫోన్ పే లావాదేవీ జరిగినట్లు మెసేజ్ చూపించి ప్రసాద్ వద్ద నగదు తీసుకుని వెళ్లి పోయాడు. తర్వాత ఫోన్ పేలో డబ్బుల కోసం చూడగా కనిపించకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి హెల్మెట్, మాస్కు ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుమారుడి వేధింపులపై వృద్ధ దంపతుల ఫిర్యాదు

అమీర్‌పేట: పెద్ద కుమారుడి బారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ వృద్ధ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట గురుద్వారా సమీపంలో ఎస్.అమర్‌సింగ్ భార్యతో కలిసి నివాసముంటున్నాడు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.పెద్ద కుమారుడైన జస్బీర్‌సింగ్ రోజు ఇంటికి వచ్చి తండ్రి అమర్‌సింగ్‌తో పాటు తల్లి మీనాకౌర్‌ను కొడుతున్నాడు. గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న అమర్ సింగ్‌కు వైద్యులు స్టంట్స్ కూడా వేశారు. ఇటీవల కత్తెరతో కడుపుపై గాయపరిచాడని, వృద్ధులనే కనికరం లేకుండా తరచూ దాడులకు పాల్పడుతున్నాడు. తమతో పాటు చిన్న కుమారుడైన సుఖ్‌బీర్‌సింగ్‌కు కూడా పెద్ద కుమారుడి నుంచి ప్రాణభయం ఉందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నామమాత్రంగా క్రీడా శిక్షణ

● మైదానాలు ఉన్నా అభివృద్ధి లేదు ● చెత్తడంపింగ్ కేంద్రాలుగా ఆట స్థలాలు ● సికింద్రాబాద్ సర్కిల్ దుస్థితి



మెట్టుగూడ మైదానంలో నిరుపయోగంగా ఓపెన్ జిమ్



చెత్త డంపింగ్ కేంద్రగా మారిన చిలకలగూడ మున్సిపల్ మైదానం

సికింద్రాబాద్: గ్రేటర్ నగరమంతా వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. దాదాపు అన్ని సర్కిళ్ల పరిధిలో ఎంపిక చేసిన క్రీడామైదానాల్లో అవసరమైనన్ని క్రీడల్లో బాలబాలికలు, యువతీ యువకులకు ఉచిత శిక్షణలు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. పదుల సంఖ్యలోని మైదానాల్లో వందకు పైబడిన క్రీడాంశాల్లో సుశిక్షితులైన కోచ్‌లు శిక్షణలు ఇస్తున్నారు. నిత్యం ఉదయం సాయంత్రం వేళల్లో ఆయా ప్రాంతాల మైదానాలు పిల్లలతో సందడిగా ఉంటున్నాయి. కానీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఇక్కడ పలు ప్రాంతాల్లో విశాలమైన క్రీడా మైదానాలున్నా వాటి అభివృద్ధి చేసే విషయంలో మాత్రం జీహెచ్‌ఎంసీ అధికారులు ఎంతమాత్రం దృష్టి సారించడం లేదు. సర్కిల్ పరిధిలో క్రీడాశిక్షణలకు అనువైన పరిస్థితులు లేకపోవడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు కేవలం నామమాత్రపు శిక్షణలతో చేతులు దులుపుకుంటున్నారు.

యువతలో నిరుత్సాహం..

◆ పలు అభివృద్ధి పనులపై దృష్టి కేంద్రీకరిస్తున్న ఇక్కడి పాలకులు సైతం క్రీడాశిక్షణల విషయంలో పట్టించుకోవడం లేదు. రహదారులు, తాగునీరు, నాలాల ఆధునీకరణ కోసం ఏటా నిధులు వెచ్చిండచం, ఆధునీకరణలు చేయడం మినహా క్రీడామైదానాల అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. ఐదు డివిజన్ల పరిధిలో సుమారు 80 వరకు ఖాళీ మైదానాలు ఉన్నాయి. ఇందులో పలు క్రీడా శిక్షణలకు వినియోగించుకునేంత విశాలమైన మైదానాలు ముప్పై వరకు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. క్రీడా శిక్షణలకు అనువుగా ఉన్న మైదానాల్లో కూడా కనీస వసతులు లేక పోవడంతో క్రీడాంశాలు నేర్చుకునేందుకు ఉత్సాహం చూపించే విద్యార్థులు, యువత నిరుత్సాహానికి గురవుతున్నారు.

చెత్తడంపింగ్ కేంద్రాలుగా.....

◆ ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వెరసి పలు విశాలమైన మైదానాలు చెత్తడంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. చిలకలగూడ మున్సిపల్ కాంప్లెక్సు స్థలంలో వాకర్స్ ట్రాక్‌తోపాటు క్రీడా మైదానం ఏర్పాటు చేస్తామని అధికారులు, పాలకులు పలుమార్లు ప్రకటనలు చేసినా ఏళ్లుగా కార్యరూపం దాల్చలేదు. చిలకలగూడ సెంటర్‌లో ఉన్న విశాలమైన ఈ స్థలాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు చెత్తడంపింగ్ కేంద్రంగా వినియోగిస్తుండడం స్థానికులకు అనర్థాలను తెచ్చి పెడుతోంది. ఇలా పలు మైదానాలు మట్టి, వ్యర్థాలతో నిండిపోయి అధ్వాన స్థితికి చేరాయి. ఫలితంగా సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను కూడా నిర్వహించని పరిస్థితులు నెలకొన్నాయి.

నామమాత్రపు శిక్షణలు...

◆ లాలాపేటలోని స్టేడియం, జామై ఉస్మానియాలోని సైక్లింగ్ స్టేడియంలలో మినహా సర్కిల్ పరిధిలో ఎక్కడా వేసవి క్రీడా శిక్షణలు లేకపోవడం గమనార్హం. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో విశాలమైన మైదానాలు ఉన్నాయి. కొన్ని కాలనీల్లో లేఅవుట్ల ప్రాతిపదికన పార్కు స్థలాలు వదిలారు. ఇందులో పచ్చదనంతోపాటు, పలు క్రీడా శిక్షణలు ఏర్పాటు చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయినప్పటికీ కనీస అభివృద్ధి చేయడం కోసం పాలకులు, అధికారులు ముందుకు రావడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ ఇవే మైదానాల్లో కొద్ది సంవత్సరాల క్రితం వరకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణలు కొనసాగించేవారు. పలు క్రీడాంశాల్లో శిక్షణలు ఇస్తున్నట్టు అధికారులు ముందస్తు ప్రకటనలు చేసేవారు. క్రమేణా మొత్తంగా మైదానాల్లో శిక్షణలు ఇవ్వకపోతుండడంతో ఔత్సాహికులు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఓపెన్ జిమ్‌లు వృథా...

◆ సర్కిల్ పరిధిలో ఏడాది క్రితం జీహెచ్‌ఎంసీ అధికారులు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. డివిజన్‌కు నాలుగైదు చొప్పున మైదానాలు ఎంపిక చేసి ఓపెన్ జిమ్‌కు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలు చూసేవారు లేకపోవడంతో అవి ఏడాది కాలానికే తుప్పు పట్టిపోతున్నాయి. స్థానికంగా క్రీడా వసతులు లేకపోవడంతో ఈ ప్రాంతంలోని ఆసక్తి కలిగిన యువతీ యువకులు సమీపంలోని రైల్వేకు చెందిన ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్, ఉస్మానియా యూనివర్సిటీ మైదానాలను ఆశ్రయిస్తున్నారు. సర్కిల్ పరిధిలో అందుబాటులో ఉన్న మైదానాలను అభివృద్ధి చేసి క్రీడా శిక్షణలు అందుబాటులోకి తెచ్చే విధంగా పాలకులు, అధికారులు చొరవ తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుచిత్ర

బన్సీలాల్‌పేట్: పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర తెలిపారు. పాన్‌బజార్‌లోని డెవలప్‌మెంట్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, ఎస్ఆర్ మల్లేశ్‌తో కలిసి మాట్లాడారు. టెన్త్, ఇంటర్, డిగ్రీలో అధిక మార్కులు సాధించిన వారికి మొదటి బహుమతి రూ. 10 వేలు, ద్వితీయ రూ. 5 వేలు, తృతీయ రూ. 2,500 అందజేస్తామన్నారు. అలాగూ 3 విభాగాల్లో 30 మందికి రూ. 1,000 చొప్పున అందజేస్తామని పేర్కొన్నారు. జూన్ 1 నుంచి పాన్‌బజార్‌లోని డెవలప్‌మెంట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తామని జూన్ 15 లోగా పూర్తి చేసి అందించాలని సూచించారు. అదేవిధంగా ఆరు నుంచి పదో తరగతి వరకు సుమారు 400 మంది విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 98662 21600 లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఆనంద్ వ్యాస్, గోపికిషన్, శ్రీనివాస్ యాదవ్, నరేంద్రపాల్, ప్రవీణ్, ధన్‌రాజ్, మహేశ్, వేణు, స్వప్న, నితీశ్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేసిన లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నగరాన్ని ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి ప్రత్యేక హోదా కల్పించాలని లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం లష్కర్ జిల్లా సాధన సమితి కార్యవర్గ సమావేశం సీతాఫల్ మండి డివిజన్ మధురానగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పోరేషన్‌గా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి తీర్మాణం ప్రతులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపించాలని నిర్ణయం తీసుకున్నట్టు సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ తెలిపారు. 1959 వరకు ప్రత్యేక కార్పొరేషన్‌గా కొనసాగిన సికింద్రాబాద్‌ను 1960లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారన్నారు. అప్పటి నుంచి సికింద్రాబాద్ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. ఇక్కడి నుంచి పన్నుల రూపంలో రూ.కోట్లు వసూలు అవుతున్నప్పటికీ అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు విషయంలో మాత్రం న్యాయం జరుగడం లేదన్నారు.

◆ రోడ్ల విస్తరణ, నూతన ఫ్లైఓవర్‌ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడం వంటి అభివృద్ధి పనులు ప్రతిపాదనలకే పరిమితం అయినట్టు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ నగరం ఆవిర్భవించి 200 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 200లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రకటించిన రూ.200కోట్ల నిధులను కూడా ఆ తరువాత వచ్చిన ముఖ్యమంత్రులు విడుదల చేయలేకపోయారని పవన్‌కుమార్‌గౌడ్ చెప్పారు. సికింద్రాబాద్ ప్రాంత సమగ్ర అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేయడం కోసం సికింద్రాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు సాదం బాల్‌రాజ్‌గౌడ్, శైలేందర్, మిట్టపల్లి బాబురావు, సునీల్‌ముదిరాజ్, కృష్ణ, రవీందర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ భూముల్లో హెచ్‌ఎండీఏ అభివృద్ధి పనులు



ఓయూ ఆర్ట్స్ కాలేజీలోని ఎస్‌బీఐ బ్యాంక్ మార్గంలో ఇనుప కంచె ఫినిషింగ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ భూముల్లో హెచ్‌ఎండీఏ పలు అభివృద్ధి పనులు చేపడుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వత తొలుత ఓయూ క్యాంపస్‌లో రూ.6 కోట్ల పెట్టుబడితో మోహిన్ చెరువు సుందరీకరణ, క్యాంపస్ అంతట మొక్కలు నాటించి ఇనుప కంచెలను ఏర్పాటు, ల్యాండ్ స్కేఫ్ గార్డెన్ సుందరీకరణ, మొక్కల పెంపకానికి, సంరక్షణకు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించారు, ఆర్ట్స్ కాలేజీ మరమ్మతులకు రూ.2 కోట్లు అందచేశారు. ఆర్ట్స్ కాలేజీ భవనం చుట్టు గార్డెన్ ఏర్పాటు చేసి ఇనుప కంచెను ఏర్పాటు చేస్తున్నారు. ఆదిధ్వని మ్యూజియం ఏర్పాటుకు ఓయూ లీజుకు ఇచ్చిన పాత క్వార్టర్లను సుమారు కోటి రూపాయాలతో హెచ్‌ఎండీఏ మరమ్మతులు చేయిస్తోంది.

అహల్యాబాయి ఎన్నో సంస్కరణలు చేపట్టారు



మాట్లాడుతున్న అధ్యక్షుడు భరత్ గౌడ్

పద్మారావునగర్: రాజమాత అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది (300) జయంతి ఉత్సవాల్లో భాగంగా పద్మారావునగర్‌లో నారీ శక్తి సమ్మేళనాన్ని గురువారం నిర్వహించారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల కన్వీనర్ టి. రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాణి అహల్యాబాయి తన పరిపాలనలో ఎన్నో నూతన విధానాలు, సంస్కరణలు చేపట్టారన్నారు. అప్పట్లోనే కుటీర పరిశ్రమల ద్వారా ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదం చేశారన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి మాట్లాడుతూ.. అహల్యాబాయి తన సంస్థానం ద్వారా వచ్చిన ఆదాయంతో దేశంలో అనేక సంస్థానాల్లో ఆలయాలను పునర్ నిర్మించారన్నారు. ముస్లింల దాడులతో శిథిలమైన కాశీ, ద్వారక, మథుర, ఉజ్జయినీ, రామేశ్వరం, అయోధ్య, హరిద్వార్, కృష్ణేశ్వర్ పుణ్యక్షేత్రాలను పునరుద్ధరించారని గుర్తు చేశారు. మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గోహాడ్ యుద్ధంలో విజయం సాధించిన రాణి అహల్యాబాయి వీరత్వాన్ని మాల్వా రాజ్యం మొత్తం గుర్తించిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కేతినేని సరళ, సుచిత్ర, కొంతం దీపికా, సుప్రియ, పావనీ, జి. రచనశ్రీతో పాటు నాయకులు శ్యాంసుందర్ గౌడ్, మేకల సారంగపాణి, శారద, అనిత, హరి అరవింద్, నాగేశ్వర్‌రెడ్డి, అనూష, రాముదర్మ, రామంచ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై కొరడా

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మూడో వార్డు పరిధిలోని ఏపీటెక్స్‌బుక్ కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన మూడో అంతస్తున్న బోర్డు ఇంజినీరింగ్ విభాగం అధికారులు గురువారం కూల్చి వేశారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ ఉమాశంకర్ మాట్లాడుతూ... అక్రమ నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో బోర్డు సీఈవో ఆదేశాల మేరకు కూల్చివేస్తున్నట్లు చెప్పారు. భవన నిర్మాణదారులు నిబంధనల మేరకు నిర్మాణాలు జరపాలని సూచించారు. ఈ కూల్చివేత కార్యక్రమంలో చీఫ్ టౌన్‌ప్లానింగ్ అధికారి ఫణికుమార్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు దినేష్, కంటోన్మెంట్ ప్లానర్ రాజేశ్వర్, ఏఈలు తరుణ్, జిష్ణు, శఇవాజి, ఆశీష్ తదితరులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్‌లో టోల్‌ఫ్రీ సర్వీసులు పునరుద్ధరించండి



సీఈఓ మధుకర్ నాయక్‌కు కలిసి వినతి పత్రం అందజేస్తున్న సతీష్‌గుప్తా

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో నివాసితుల ఫిర్యాదుల నమోదు కోసం టోల్‌ఫ్రీ సర్వీసులు, ఇంటి పన్ను కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నేత సతీష్‌గుప్తా కోరారు. ఈ మేరకు గురువారం సీఈఓ మధుకర్ నాయక్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ చావనీ పోర్టల్ స్తంభించడం వల్ల ఫిర్యాదులు చేయలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీఈఓకు తెలిపారు. చిన్న చిన్న సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలు బోర్డు కార్యాలయానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాజాగా వర్షాలు మొదలైన నేపథ్యంలో అత్యవసర పనుల నిమిత్తం ప్రజలు ఫిర్యాదు చేసేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అలాగే ప్రతి వార్డు కమ్యూనిటీ హాల్‌లో ఇంటి పన్ను (ట్యాక్స్ కలెక్షన్) సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న భానుక నర్మద

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు బోర్డు నామినేటేడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ తెలిపారు. గురువారం మూడో వార్డు హ్యాపీ ఎన్‌క్లేవ్‌లో కాలనీవాసుల భాగస్వామ్యం, బోర్డు నిధులతో చేపట్టే తాగునీటి పైపులైన్ పనులను నర్మద ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బోర్డు పరిధిలోని ఇతర కాలనీవాసులు కూడా తాగునీటి పైపులైన్ల కోసం బోర్డుకు తమ వాటాగా డబ్బులు చెల్లిస్తే బోర్డు నిధులు కలిపి తాగునీటి పైపులైన్ పనులు చేపడతా మని హామీచ్చారు. అదేవిధంగా జ్యోతి కాలనీలో రూ.50లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అరుణ్, బీఎస్. శ్రీనివాస్,మధు, రమేష్, వనిత, వినోద, అనురాధ, సబిత, ప్రవీణ్, సంగీత, రాజేశం, సెక్రటరీ చంద్రశేఖర్, శర్మ, కృష్ణణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌ను.. రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటు

కంటోన్మెంట్: ఆపరేషన్ సింధూర్‌ను బీజేపీ నాయకులు రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఈ మేరకు బీజేపీ తీరును ఎండగడుతూ టీపీసీసీ ఆధ్వర్యంలో జైహింద్ యాత్ర సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఏర్పాటు చేసిన ఈ ర్యాలీలో పాల్గొనడానికి కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే శ్రీ గణేష్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదంతో పహల్గాంలో భారతపౌరులపై ఉగ్రవాదుల దమనకాండకు వ్యతిరేకంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టి పాకిస్తాన్‌కు సరైన సమాధానం చెప్పిందన్నారు. ఈ విజయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ స్వార్థ రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. పాకిస్తాన్‌పై తీసుకునే ఎలాంటి చర్యలకైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని కాంగ్రెస్ ప్రకటించిందన్నారు.



ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆధ్వర్యంలో జైహింద్ యాత్రకు బయల్దేరిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

సకాలంలో దరఖాస్తులు అందజేయాలి

మీ సేవా నిర్వాహకులకు తహసీల్దార్ భీమయ్య ఆదేశం



మీ సేవా కేంద్ర నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భీమయ్యగౌడ్

అడ్డగుట్ట: మీ సేవా కేంద్రాల నిర్వాహకులు సకాలంలో దరఖాస్తు ఫారాలు మండల కార్యాలయంలో అందజేయాలని తహసీల్దార్ భీమయ్య సూచించారు. గురువారం మండల పరిధిలో ఉన్నటువంటి మీ సేవా కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. కొందరు మీ సేవా కేంద్ర నిర్వాహకులు క్యాస్ట్, ఇన్‌కమ్, రెసిడెన్సీ తదితర సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేస్తున్నారు కాని సంబంధిత ధ్రువపత్రాలను మండల కార్యాలయంలో అందజేయడం లేదన్నారు. దీంతో కొన్ని సర్టిఫికెట్లు రిజెక్ట్ అవుతున్నాయన్నారు. అన్ని సరైన పత్రాలు సమర్పించినా కూడా అధికారులు రిజెక్ట్ చేస్తున్నారని దరఖాస్తుదారులు కార్యాలయానికి వచ్చి వాపోతున్నారన్నారు. అందువల్ల మీ సేవా కేంద్ర నిర్వాహకులు వివిధ సర్టిఫికెట్లు నిమిత్తం చేసే దరఖాస్తుకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను సకాలంలో కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజు నాయక్, స్పెషల్ ఆర్ఐ కృతిక, జూనియర్ అసిస్టెంట్ సృజన, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



తహసీల్దార్ భీమయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

మండల పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు మారేడపల్లి మండల అధికారులు కృషి చేయాలని సీపీఎం జోన్ కార్యదర్శి ఎం.అజయ్‌బాబు అన్నారు. ఈ మేరకు గురువారం సీపీఎం నాయకులు తహసీల్దార్ భీమయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మారేడుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతూనే ఉన్నాయన్నారు. అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా కూడా ప్రభుత్వ భూములను కాపాడలేకపోతున్నారని ఆరోపించారు. ఇదే అదునుగా భూకబ్జాదారులు కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్లు, ఇంజక్షన్ ఆర్డర్లు తెచ్చుకొని నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో రెవెన్యూ అధికారులు సైతం కబ్జాలకు గురవుతున్న భూములను రక్షించలేకపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేసి చుట్టూ కంచెలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్. మల్లేష్, బాలయ్య, ఎల్లయ్య అంజమ్మ, ఫాతిమా, రేణుక, చారి, రాములు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే మండల కార్యాలయంలో తెలియజేయాలి

మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్



అడ్డగుట్ట: మారేడుపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల విషయంలో అభ్యంతరాలు ఉంటే మండల కార్యాలయంలో తెలియజేయాలని తహసీల్దార్ భీమయ్యగౌడ్ తెలిపారు. గురువారం మారేడుపల్లి మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా గతంలో నిర్మించన 478 డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో ఇది వరకే మొదటి విడతలో 273 అలాట్ చేశామన్నారు. మిగిలిన వాటి కోసం దరఖాస్తు పెట్టుకున్న వారిలో అర్హులైన 154 మందిని ఎంపిక చేసి కలెక్టరేట్‌కు పంపినట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఆదేశానుసారం 148 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయని అన్నారు. దానికి సంబంధించిన జాబితా కూడా విడుదల చేశామన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను మారేడుపల్లి మండల కార్యాలయం నోటీస్ బోర్డులో అంటిస్తామని అన్నారు. దీనితో పాటు సికింద్రాబాద్ ఆర్డీవో కార్యాలయం, మారేడుపల్లి పోలీస్ స్టేషన్, తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్లలో కూడా లబ్ధిదారుల జాబితాను అతికిస్తామని చెప్పారు. మారేడుపల్లి డబుల్ బెడ్రూమ్ ఇళ్ల దరఖాస్తుదారులతో పాటు లబ్ధిదారులకు ఎటువంటి అభ్యంతరాలున్నా మండల కార్యాలయం, సికింద్రాబా ద్రాబాద్ ఆర్డీవో కార్యాలయాల్లో తెలియజేయాలని కోరుతున్నామన్నారు.